# అబద్ధం

కథ

## జి. తులసీరాం

చంద్రుడు విశ్రాంతి తీసుకోవడానికి సిద్ధపడుతున్న సమయం. సూర్యుడు రోజూ ఒకే పని పదే పదే చేస్తున్నా బోరు చెంద కుండా తన విధి నిర్వర్తించడానికి సిద్ధంగా వున్నాడు.

అదో చిన్న టౌను. ఆ వీధిలో పాలవాడు, ఇంటింటికి వార్తాపత్రిక వేసే అబ్బాయి తప్ప రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. ఆ వీధిలో, ఆటో శబ్దం చేసుకుంటూ వచ్చి వెంకట్రామయ్య ఇంటి ముందు ఆగింది. ఆ ఆటో నుంచి ఒక యువతి దిగి లగేజీ దింపుకుంది. ఆ తర్వాత డ్రైవర్‌కి ముందే కుదుర్చుకున్న బేరం ప్రకారం డబ్బు చెల్లించింది. ఆమె వట్టి మనిషి కూడా కాదు. ఆరునెలల గర్భవతి. అనూష అనబడే ఆమె కొంచెం కష్టపడుతూ లగేజీ చేతపట్టుకొని వెళ్లి ఇంటి తలుపు తట్టింది. అరనిమిషం వరకు ఆ ఇంటి తలుపు తెరుచుకోలేదు. అనూష నిట్టూర్చి ఈసారి కొంచెం గట్టిగా తలుపు తట్టింది.





మరో అరనిమిషం తర్వాత కావేరమ్మ ఆవలిస్తూ ఒక చేయి నోటికడ్డం పెట్టుకొని మరో చేత్తో తలుపు తీసింది. అనూషను చూసిన వెంటనే కావేరమ్మ కళ్లు పెద్దవయ్యాయి. గుండె వేగం పెరిగిపోయింది. ఆమె ఆవలించడం పూర్తి చేసినా నోటికడ్డం పెట్టుకున్న చేయి తీసివేయడం మరిచిపోయి అలా అనూషనే చూస్తూ ఉండిపోయింది.

అనూష తటపటాయిస్తూ మెల్లగా ''అమ్మా...'' అంది. కావేరమ్మ అనూషను, ఆమె కడుపును చూస్తూండిపోయింది.

''అమ్మా....''

కావేరమ్మ ముఖంలో సంతోషం, దుఃఖం, భయం లాంటి రకరకాల భావాలలో వెంటవెంటనే రంగులు మారుతున్నాయి.

దాదాపు ఎనిమిది నెలల తరువాత కూతురును చూస్తున్నందుకు సంతోషం! క్రితం ఎనిమిది నెలల్లో అనూషను, చూడనందుకు, చూసిన వెంటనే ఆమె చేసిన పని మళ్లీ గుర్తొచ్చినందుకు దుఃఖం!!

అనూషను చూసి ఆమె భర్త, కొడుకూ, కోడళ్లు, చిన్న కూతురు ఏమంటారోనన్న భయం!! ఇన్ని భావాలతో ఆమె సతమతమైపోతోంది.

అనూషనే మళ్లీ మాట్లాడింది. ''అమ్మా.. ఇన్ని నెలల తరువాత ఇంటికొచ్చాను. కనీసం ఎలా వున్నావు? అనైనా అడిగావా?''

కావేరమ్మ అనూషతో 'మాట్లాడాలా?వద్దా?' అన్న సందిగ్ధంలో పడింది. ఆమెకు మాట్లాడాలనే వుంది. కానీ మాట్లాడితే భర్త ఏమంటాడో అన్న అనుమానం మరో వైపు!! ఆమె అలానే దారికడ్డంగా నిలబడింది.

అనూష లగేజీ మళ్లీ అందుకోవడంతో కావేరమ్మ పక్కకు జరిగి దారిచ్చింది. అంతలో వెంకట్రామయ్య గదిలో నుంచి కేకేసారు. ''ఎవరే వచ్చింది? క్యాంపుకెళ్లిన పెద్దోడు వచ్చాడా?''

ఆయన కేక విని అనూష, కావేరమ్మ ఉలుకూ పలుకూ లేకుండా స్థంభాల్లా నిలుచుండిపోయారు. సమాధానం రాకపోయేసరికి ఓపిక పట్టలేక ఆయనే గది బయటకొచ్చి చూసారు. అనూషను చూసిన వెంకట్రామయ్య మొహం క్షణకాలం బిగుసుకుపోయి, ఆ వెంటనే కోపంతో ఎరుపెక్కిపోయింది. ఆయన ముక్కుపుటాలు అదరసాగాయి. రామయ్య చేతి కర్రను విసిరికొట్టి తడబడుతూ గదిలోకి వెళ్లిపోయి పెద్దపెద్దగా అరవడం మొదలుపెట్టారు.

''అమ్మా, నాన్న, అన్న, తమ్ముడు, చెల్లెలు ఎవరూ అక్కర్లేదనుకొని వాడెవడితోనో కులం తక్కువ వాడితో వెళ్లిపోయింది కదా.... మళ్లీ సిగ్గు లేకుండా ఎందుకొచ్చింది? మనమూ, మన పరువు గంగలో కలిసినా పర్వాలేదు అనుకొని వెళ్లిపోయింది... మన గూర్చి చుట్టుపక్కల వాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించకుండా, ఆలోచించినా అదేమీ పెద్ద విషయం కాదన్నట్లు పట్టించుకోకుండా వెళ్లిపోయింది. కనీసం ఆమె వెళ్లిపోతే చిన్న దానికి పెళ్లికావడం ఎంత కష్టమో అని కూడా అనుకోలేదు. ఆమె మొహం నాకు చూపించవద్దని చెప్పు...వెళ్లిపొమ్మని చెప్పు.. వెంటనే వెళ్లిపొమ్మను...''

వెంకట్రామయ్య అరుపులు విని చిన్నకొడుకు సురేష్ ఏమైపోయిందో అనుకుంటూ గాభరాగా గది తలుపులు తీసి బయటకొచ్చి చూసాడు. అతని వెనుకే అతని భార్య కూడా వచ్చింది. వాళ్లిద్దరికీ హాలులో నిలబడి వున్న అనూష కనపడింది. ఇద్దరికీ తేరుకోలేనంత షాక్ కలిగింది! వారికి వెంకట్రామయ్య అరుపులకు కారణం వెంటనే తెలిసింది. సురేష్ తొందర్లోనే తేరుకొని వెంకట్రామయ్య గదిలోకెళ్లి 'నాన్నా నీ అరుపులు కొంచెం తగ్గించు. ఊర్లో వాళ్లకి అనూష వచ్చిందని తెలిస్తే పని లేని జనాలు మన ఇంటి ముందు ఎగ్జిబిషన్ పెడతారు. నువ్వు ఊరుకో!''

వెంకట్రామయ్య సురేష్‌నుద్దేశించి ''చచ్చిపోయిందనుకున్నది మళ్లీ మన ఇంటికెందుకొచ్చిందో కనుక్కో!''అని విసురుగా అనూషకు వినపడేటట్లుగానే అన్నాడు.

''సందీప్, నేనూ విడిపోయాం!'' మరో బాంబు పేల్చింది అనూష.

ఆ ఇంట్లో వాళ్లందరికీ మరోసారి విద్యుద్ఘాతం తగిలింది. అందరూ స్థాణువుల్లా నిలబడిపోయారు. అనూష ఎవరో నిలబడివున్నట్లు అనిపిస్తే వెనుకకు తిరిగి చూసింది. వదిన, చెల్లెలు వున్నారు. వదిన కూడా గర్భవతి. ఎన్నో నెలో తెలియదు. వాళ్లు మేడ పై నుంచి ఎప్పుడొచ్చారో ...వెనుక నిలబడి వున్నారు.

సురేష్ చెల్లెలు వంక తిరిగి...''సుధీ ఊర్లో అందరికీ అనూష వచ్చిన విషయం తెలియక ముందే తెరిచిన ఇంటి తలుపులను మూసేయ్!''అన్నాడు. ఆమె సురేష్ చెప్పినట్లే చేసింది. అతను అనూష వంక తిరిగి కోపంగా 'ప్రేమించి పెళ్లి చేసుకున్నావుగా... ఇప్పుడెందుకు విడిపోవడం?' అనడిగాడు.

''ఆయన నేను అనుకున్నంత మంచి మనిషి కాదు.''

''నువ్వనుకున్నంత మంచి మనిషి కాకపోతే వదిలేస్తావా? అలాగయితే ఈ ప్రపంచానికి ఎవరూ సంసారం చేయలేరు. నువ్వు సర్దుకుపోవడం కాస్త నేర్చుకోవాలి,తమ్ముడైన సురేష్ అనూషను నిలదీస్తుంటే ఆమెకు కోపం, చిరాకు కలుగుతోంది.

''ఆయనకు ప్రతి చెడు అలవాటూ వుంది.''

''అది నువ్వు తెలివిగా మాన్పించుకోవాలి!''

అనూష సహనం కోల్పోయి హిస్టీరిక్‌గా అరిచింది. ''ఆయన నన్ను చితకబాదుతాడు. ఇంకొన్ని రోజులు ఆయనతో కాపురం చేస్తే ఛస్తాను! అయినా పర్వాలేదా?'' ఆమె అలా అరవడంతో సురేష్ నోరు మూసుకున్నాడు.

అక్కడ భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది. ఎంత సేపటికీ ఎవరూ మాట్లాడకపోయేసరికి అనూష తన ఎయిర్‌బ్యాగులో నుంచి టవల్, సబ్బు తీసుకొని స్నానం చేయడానికి బయలుదేరింది.

ఆమె స్నానాల గది వైపు వెళ్లడంతో ఇంట్లోని సభ్యులంతా వెంకట్రామయ్య గదిలోకి చేరుకున్నారు.

పెద్దాయన మాట్లాడడం మొదలుపెట్టాడు.



''ఎవరూ అక్కర్లేదనుకొని ఆ కులం తక్కువ వెధవతో వెళ్లిపోయింది. సరే చచ్చిందనుకుంటే... ఇప్పుడు మళ్లీ తిరిగొచ్చి విడిపోయాం అంటోంది. ఈ విషయం నలుగురికీ తెలిస్తే నవ్విపోరూ? మన పరువు ప్రతిష్టలు ఏం కావాలి? అందరికీ మన తల చూపించడం ఎలా?''

కావేరమ్మ కంగారుగా ''ఏమండీ మెల్లగా.... మన మాటలు అమ్మాయికి వినపడితే బాధపడు తుంది. అసలే ఒట్టి మనిషి కూడా కాదు''అంది.

వాళ్ల మాటలు స్నానానికి వెళ్లిన అనూషకు వినపడుతూనే వున్నాయి.

''కేవలం దాని స్వార్థం మాత్రం చూసుకొని వెళ్లింది కదా! బాధపడనీ! అది వెళ్లే ముందు సుధ పెళ్లి గురించి ఆలోచించిందా?''

సుధ బెంగపడిపోతూ... ''రేపు నన్ను చూసు కోవడానికి పెళ్లివారు వస్తున్నారు కదే! అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. ఎంతో వెతికితే తప్ప దొరక లేదు. వాళ్లకు అక్క విషయం తెలిస్తే పెళ్లికి ఒప్పు కుంటారా?'' అంది.

సురేష్ అందుకొని ఆవేశంగా ''నువ్వుండవే... మధ్యలో నీ పెళ్లి గొడవ ఒకటి. అక్క విడిపోయి వచ్చేస్తానంటోంది. కొంపతీసి ఇక్కడే ఉండిపో తుందేమిటి? ఇప్పుడు ఆమెను ఎవరు భరిస్తారు? ఆమెకు కొడుకో, కూతురో పుడితే వాళ్లను ఎవరు భరిస్తారు? ఇప్పుడే సుధ పెళ్లి ఖర్చంతా నా పైనే పడేట్లుంది. పెద్దోడు వదిన డెలివరీకి నా వద్దనున్న డబ్బంతా సరిపోతుందని చేతులెత్తేసాడు. సుధకేమో సాఫ్ట్‌వేర్ ఇంజనీరే కావాలంట! నేనెక్కడికి పోవాలి? కాల్‌సెంటర్‌లో అడ్డమైన ప్రతి తెల్లవాడి దగ్గరా బూతులు తిట్టించుకొని డబ్బులు సంపాదిస్తుంటే చివరకు నాకు మిగిలేదేమిటి? చేతికి చిప్పా? సెలవు పెట్టి నాలుగురోజులు గడుపుదామని వస్తే ఏమిటీ గొడవ?''

కావేరమ్మకు సురేష్ తన కడుపున ఎలా పుట్టాడో అర్థం కాదు అప్పుడప్పుడు. ఆసుపత్రిలో చిట్టీ మారిపోయిందేమోననిపిస్తుంది. సురేష్‌ని చీమ కుట్టినా దాన్ని పక్కకు తిరిగి చేత్తో పట్టుకొని నలిపిపారేయడం వల్ల ఎంత శ్రమ కలుగుతుంది? చీమ కుట్టించుకుంటే ఎంత బాధ కలుగుతుంది? అన్నదాన్ని లెక్కలు కట్టి, బేరీజు వేసుకొని ఏది ఎక్కువ లాభదాయకమో ఆ పని చేస్తాడు. అతనికి ప్రతి విషయమూ తన సొంత లాభ,నష్టాల లెక్క కిందకే వస్తాయి. ఎలా ఎప్పుడు, ఎక్కువ లాభం పొందుతామో అనే చూస్తుంటాడు. కావేరమ్మ సురేష్‌ను అదుపులో పెట్టడానికి 'అను వింటే బాధ పడుతుంది. అంత గట్టిగా మాట్లాడతావేమిటిరా? నీకు చెపితే అర్థం కాదా?' అంది.

సురేష్ అమ్మపై మండిపడ్డాడు. 'ఆ... నీకేం ఎన్నయినా అంటావు! నేను డబ్బు సంపాదించడానికి ఎన్ని ముప్పతిప్పలు పడుతున్నానో నీకు తెలిస్తే కదా నా బాధ అర్థమయ్యేది!'

''ఏమిట్రా నువ్వనేది? నువ్వు మాత్రమే ప్రపం చంలో డబ్బులు సంపాదిస్తున్నట్లు పెద్ద గొప్పగా చెప్పుకుంటున్నావు? సొంత అక్క పాపం భర్తతో గొడవపడి ఎనిమిది నెలల తరువాత ఇంటికొస్తే కనీసం బాగున్నావా అనైనా అడగకుండా వెంటనే నీ లెక్కలు ప్రారంభించావు. గర్భవతి అయిన అను ఎంత బాధపడుతుందో ఒక్కసారైనా ఆలోచించావా? ఛీ... నువ్వు మనిషివేనా?''

వెంకట్రామయ్య బుస్సున కావేరమ్మపై లేచాడు. ''ఏమిటే నువ్వు వాడినంటున్నావు? ఇల్లు వదిలి పెట్టి లేచిపోయిన కూతురుని వెనకేసుకొస్తున్నావు? రేపు వాడేనే నీ రెండో కూతురుకు మంచి సంబంధం వెతికి పెళ్లి చేయాల్సింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని తెచ్చి పెళ్లిచేయడం నీ పెద్దకొడుకు చేతనవుతుందా? గవర్న మెంటు బ్యాంకుల్లో క్లర్కు ఉద్యోగం చేసేవాడి వల్ల ఏమవుతుంది?''

కావేరమ్మ వెంటనే పెద్ద కోడలి వంక చూసింది. ఆమె సిగ్గుతో తల వంచుకొంది. వీళ్ల మాటలు విం టుంటే కావేరమ్మకు పిచ్చెక్కుతున్నట్లుంది. 'ఇంత వయసొచ్చినా అబ్బా,కొడుకుకు ఎలా మాట్లాడాలో తెలీదు' అనుకొంది. తెగేదాకా లాగడం మంచిది కాదనుకొని అక్కడి నుంచి నిష్క్రమించింది. ఆమె వెంటే పెద్దకోడలు వెళ్లిపోయింది. సురేష్ భార్య, సుధ అక్కడే నిలబడిపోయారు.

కావేరమ్మ టిఫిన్ తయారుచెయ్యడంలో నిమగ్న మైపోయినా అనూష భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ బాధపడసాగింది. 'పెద్దవాడు వుంటే బాగుండును. వాడికి అనూష అంటే ప్రాణం. దాన్ని ఇన్ని మాటలు పడనిచ్చుండేవాడు కాదు. ఎప్పుడొస్తాడో ఏమిటో!'

అనూష టిఫిన్ చేసి వచ్చి హాల్లో కూర్చుంది. ఆమెతో ఎవరూ మాట్లాడలేదు. అందరూ తప్పిం చుకునే తిరుగుతున్నారు. 'నాన్న పంతం నాన్నదే. ఆయన కంఠంలో ప్రాణమున్నంతవరకూ మాట్లాడడు. సుధకు కలవరమంతా రేపు ఇంటికి వచ్చే పెళ్లివారి పైనే వుంది. ఇక సురేష్ సరేసరి! సురేష్ మాట్లాడక పోతే చిన్న వదిన మాట్లాడదు. పెద్ద వదిన ఎందుకు మాట్లాడడం లేదు? అమ్మ ఎందుకు మౌనంగా వుంది. అమ్మ నాతో మాట్లాడితే నాన్న ఏమంటారోనని భయం! అమ్మకు మాట్లాడాలనే వుంది. అయినా మాట్లాడడం లేదు. అన్నయ్య వుంటే నన్ను చూసి చాలా బాధపడేవాడేమో! ఎంత ఇష్టం అన్నయ్యకు నేనంటే! నన్ను ఎంతో బాగా చూసుకునేవాడు. నాపైన ఈగ వాలినా తట్టుకోలేకపోయేవాడు. ఎక్కడికి వెళ్లాడు? పొద్దున్న నాన్న ఏదో క్యాంప్ కన్నట్లు గుర్తు... ఎప్పుడొస్తాడు?

అనూషతో ఎవరు మాట్లాడలేదు. ఆమె హాల్లో లేనట్లే అందరూ తమ పని తాము చేసుకుంటూ ఆమెను పట్టించుకోలేదు. అనూష ఏదో ఆలోచిస్తూ అలానే సోఫాపై పడుకొని నిద్రపోయింది.

ఆమె నిద్ర లేచేటప్పటికి మధ్యాహ్నం అయింది. బాత్‌రూమ్‌కెళ్లి మొహం కడుక్కుంది. ఆమెకు అన్నయ్య ప్రసాద్ గొంతు వినపడసాగింది. త్వరగా కాళ్లచేతులు కడుక్కొని హాల్లోకొచ్చింది. వెంకట్రా మయ్య ప్రసాద్‌తో మాట్లాడుతున్నాడు. తన గురించే.. కాస్సేపటికి ప్రసాద్ హాల్లోకొచ్చాడు. అనూషే అతన్ని మొదట మాట్లాడించింది.

''ఎప్పుడొచ్చావు క్యాంపు నుంచి?''

''ఇప్పుడే... నువ్వు నిద్రపోతున్నావు. నువ్వు

విడిపోవాలనుకుంటున్నావంట నిజమేనా?''

''అవును నిజమే''

''నన్ను ఆయనతో మాట్లాడమంటావా?''

''లాభం లేదు''

''అలా అంటే ఎలా? మెల్లగా నువ్వే ఆయన్ని మార్చుకోవాలి! విడిపోవడం సమస్యకు పరిష్కారం కాదు! ఏమంటావు?''

''ఇప్పుడే కదా క్యాంపు నుంచి వచ్చావు...పద భోంచేద్దువు గాని! తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు. ఇంతకీ ఏమిటా క్యాంపు?''

''రెండు వారాల కంప్యూటర్ ట్రైనింగ్. బ్యాంకు ఇప్పుడంతా కంప్యూటరైజ్డ్ చేస్తున్నారు. మా ప్రభుత్వ సంస్థలకు కొంచెం ఆలస్యంగా మెలకువ వస్తుంది కదా!''

అనూష, ప్రసాద్ కలిసి భోంచేసారు. అనూషే మధ్య మధ్యలో రెండు మూడు ప్రశ్నలు వేసింది. ప్రసాద్ వాటికి సమాధానం చెప్పి ఊరుకున్నాడు. మరేమీ మాట్లాడలేదు. అతను భోజనం ముగించి విశ్రాంతి తీసుకోవడానికి మేడపై నున్న తన గదికెళ్ళిపోయాడు.

ఇంట్లో మిగిలిన వాళ్లంతా భోంచేసి తమ తమ గదుల్లోకెళ్ళిపోయారు. అనూష పొద్దున నిద్ర పోయింది కాబట్టి తనకు మళ్లీ నిద్ర రావడం లేదు. కాస్సేపు అలానే హాల్లో కూర్చుంది. పొద్దుపోక ప్రసాద్‌తో మాట్లాడుదామని మేడపైకెళ్లింది. వాళ్ల గదిలోంచి మాటలు వినపడుతున్నాయి.

''సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని తెచ్చి పెళ్లిచేయడం పెద్ద కొడుకు చేతనవుతుందా? గవర్నమెంటు బ్యాంకుల్లో క్లర్కు ఉద్యోగం చేసేవాడివల్ల ఏమవుతుంది? అని మీ నాన్న అన్నప్పుడు నా తల కొట్టేసినట్లయింది'' అనూష వదిన అంది.

''సురేష్‌కి ఉద్యోగం వచ్చి ఎన్ని రోజులయింది? కనీసం సంవత్సరమన్నా అయ్యిందా? ఏడు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తూ కుటుంబ భారమంతా మోస్తున్నదెవరు? సురేష్‌ని, సుధను చదివించిందెవరు? అదంతా ఆయనకు గుర్తురాలేదా? ఆయన ఎక్కడా ఏపనిలో చేరినా అక్కడందరితో గొడవ పెట్టుకొని రెండు రోజులకంతా ఇంట్లోకొచ్చి కూర్చుంటాడు. అప్పుడు ఆయనకు తిండిపెట్టిందెవరు? నిన్న కాక మొన్న ఉద్యోగమొచ్చిన సురేష్‌కి నాకన్నా ఎక్కువ జీతమొచ్చేటప్పటికి అంత అలుసైపోయానా? ప్రైవేటు ఉద్యోగం ఎన్ని రోజులుంటుందో చూద్దాం!'' అని ప్రసాద్ అన్నాడు.

''మీ చెల్లెల్ని చూస్తుంటే ఇక్కడే తిష్టవేసేట్లుంది. మీ తమ్ముడు మెల్లగా తప్పించుకొని అనూష భారమంతా మీపైన మోపడానికి ప్రయత్నిస్తాడు. మీరసలే అమాయక చక్రవర్తులు. చాలా జాగ్రత్తగా వుండాలి!''

''దాని పీడ ఎలాగైనా వదిలించుకోవాలని, 'నన్ను ఆయనతో మాట్లాడమంటావా? విడిపోవడం సమస్యకు పరిష్కారం కాదు'అన్నాను. దాని మాటలను బట్టి చూస్తుంటే మళ్లీ ఆయనతో కాపురం చేసేట్టు లేదు. అది చాలా మొండిది. ఉడుము పట్టుపడితే వదలదు. శనిలాగా మనకు చుట్టుకునేట్లుంది. ఎలాగైనా చేసి వదిలించుకోవాలి...లేకపోతే దాన్నే కాకుండా దాని బిడ్డను కూడా మనమే భరించాల్సి వస్తుంది.''

''అవునండీ! మీరు వెంటనే ఏదో ఒకటి చేయకూడదూ?''

''నువ్వు అనూష దగ్గరికి వెళ్లి... విడిపోదల్చుకున్నావు. నీకు పుట్టేబిడ్డకు తండ్రి లేకుండా పోతుంది. అబార్షన్ చేయించుకోకూడదూ అని ఒక ఉచిత సలహా పడేయ్'' తెలివిగా చెప్పాడు ప్రసాద్.

''ఇంతకీ ఆరో నెల్లో అబార్షన్ అవుతుందా?''

''అది నాకన్నా నీకే బాగా తెలియాలి. నన్ను అడుగుతావేమిటి?''

అనూష గుండె భారమైంది. ఆ తర్వాత విన దల్చుకోలేదు. వెంటనే వెనుతిరిగి మెట్లు దిగ సాగింది. ఆమెకు ప్రసాద్ కన్నా సురేష్ మేలనిపించింది. సురేష్ ఉన్నదున్నట్లు మొహంపై చెబుతాడు. కానీ ప్రసాద్ అలా కాదు. ముందొక విధంగా వెనుకొక విధంగా ప్రవర్తిస్తాడు. అనూషకు ప్రసాద్ రూపంలో ఎవరో కొత్త వ్యక్తి పరిచయమైనట్లుంది. అతడు ఇంత నీచంగా ఆలోచిస్తాడని అనూష కలలో కూడా అనుకోలేదు. డబ్బు మనుషుల

## దృఢ సంకల్పం

మన ప్రాచీన జీవన విధానం ఇప్పుడు అందరి మన్ననలూ పొందుతోంది. మొన్నమొన్నటి వరకూ యోగా గురించి అంతగా పట్టించుకోని ప్రజానీకం, సినిమా తారలు ఇప్పుడు యోగాకు విస్తృత ప్రచారాన్ని కలిపిస్తున్నారు. మనీషా కొయిరాలా కూడా ఇదే మంత్రాన్ని పఠిస్తోంది. అమీర్ ఖాన్‌తో గతంలో నటించిన ఓ చిత్రంలో తల్లి పాత్ర పోషించిన మనీషా ఇప్పుడు దానికి భిన్నంగా ఇక నుంచి అలాంటి పాత్రలకి దూరంగా వుండాలని భావిస్తోంది. అంతేకాదు గ్లామర్‌ని మరింతగా పెంచుకునేందుకు గాను యోగాని బాగా ప్రాక్టీసు చేస్తోంది. ఆహార నియమాలు పాటించడం, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కి అలవాటు పడడం ద్వారా తన జీవనవిధానంతో పాటూ కెరీర్ ని కూడా కొత్త పంథాలోకి తీసుకెళ్లాలన్న దృఢసంకల్పంతో ఉంది నేపాలీభామ.



మనస్తత్వాల మీద ఇంత ప్రభావం చూపుతుందా? లేక అన్నీ ఆర్థికపరమైన లావాదేవీలేనా? ఆమెకు అంతా అయోమయంగా వుంది. ఆమె వెంటనే ఒక ముఖ్యమైన నిర్ణయానికి వచ్చింది.

★★★

సాయంత్రం ఐదు గంటలకు ఒక్కొక్కరుగా వాళ్ల గది నుంచి బయటకొచ్చారు. కాస్సేపటికి కావేరమ్మకు అనూష ఎక్కడుందన్న అనుమానం కలిగింది. ఆమె ఇల్లంతా కలియ జూసింది. ఎక్కడా కనిపించకపోయేసరికి గాభరా ఎక్కువైయింది. 'ఇంట్లో వాళ్ల సూటిపోటి మాటలకు బాధపడి ఏ అఘాయిత్యం చేసుకోలేదు కదా?' అన్న అనుమానం కలిగింది. ఆమె మొహమంతా చెమటలు పట్టేసింది. పరుగులాంటి నడకతో మేడ మెట్లెక్కింది. అక్కడ కూడా ఆమెకు అనూష కనిపించలేదు. ఆమెకు విపరీతమైన భయం పట్టుకుంది. కిందకు వచ్చి 'ప్రసాదూ... ప్రసాదూ...' అంటూ కేకలేసింది.

''ఏమైందే? ఎందుకలా అరుస్తున్నావు?''

''అనూష ఎక్కడా కనపడడం లేదు. నీకేమైనా చెప్పిందా?''

''అనూష కనపడడం లేదా?'' అంటూ ప్రసాదు హాల్లో ఆమె లగేజ్ కోసం చూసాడు. టీపాయి వద్ద పెట్టిన ఆమె లగేజీ కనపడ లేదు కానీ టీపాయ్ పై ఒక తెల్లకాగితం దానిపై ఫ్లవర్‌వాజ్ కనపడింది. ప్రసాద్ ఆ కాగితం అందుకొని అందరికీ వినపడేట్లు ఆదుర్దాగా చదవసాగాడు.

**'ప్రియమైన నా కుటుంసభ్యులకు,**

నన్ను మీరు క్షమించాలి. నేను మీకో అబద్ధం చెప్పాను. అదేమిటో చెప్పే ముందు సందీప్ గురించి కొంచెం చెప్పాలి. అతనికి మనుష్యులను చదవడం అంటే చాలా ఇష్టం. ఏ పరిస్థితిలో ఎవరెలా ప్రవర్తిస్తారని ఎప్పుడూ అంచనాలేసుకుంటూ వుంటారు. మనుష్యుల మనస్తత్వాలు తెలుసుకోవడానికి అప్పుడప్పుడు ప్రాక్టికల్ జోక్స్ కూడా చేస్తుంటారు. అతను, నేను చిన్న పందెం కట్టుకున్నాం! నాపై మీకు అమితమైన ప్రేముందని, ఎట్టి పరిస్థితుల్లోనూ నన్ను మీరు దూరం చేసుకోరని నేను, అలాకాదని ఆయన పందెం కట్టుకున్నాం! అయితే నువ్వు వెళ్లి మనిద్దరం విడిపోయాం అని చెప్పు. నీ పురుడు వరకు నిన్ను ఇంట్లో వుండనిస్తే నువ్వు గెలిచినట్లు. లేకపోతే నేను గెలిచినట్లు అన్నారు. నేను సరేఅన్నా.

ఇంటికొచ్చిన తరువాత నాకు తెలిసింది. రేపు సుధను చూడడానికి పెళ్లివారొస్తున్నారని! సుధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని పెళ్లిచేసుకోవాలని కలలు కంటోంది. చాలా కష్టపడి సుధ కోసం ఆ సంబంధం తీసుకొచ్చారని నాకర్థమ య్యింది. అలాంటిది నా మూలంగా ఆ సంబధం చెడిపోవడం నాకే మాత్రం ఇష్టం లేదు. నేను సుధ పెళ్లికి ఆటంకం కాకూడదు. అందుకే వెంటనే బయలుదేరాలని నిర్ణయిం చుకున్నా. నేను తిరిగి వెళ్లిపోతున్నంత మాత్రాన సందీప్‌తో పందెంలో ఓడిపోయి నట్లు కాదు. నేను తిరిగొచ్చింది ఓడిపోయి కాదు. సుధ పెళ్లికారణంగా అని గట్టిగా వాదిస్తాను. కావాలంటే మరోసారి ఇంకేదైనా ప్రాక్టికల్ జోక్ వేసి పరీక్షించమంటాను.

అమ్మా, నాన్న మీ ఆరోగ్యం జాగ్రత్త! అన్నా, వదినా మీకు పండంటి బిడ్డ పుట్టాలని కోరుకుంటున్నాను. సురేష్ నువ్వు నీ ఉద్యోగంలో ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నాను. సుధా నువ్వు కోరుకున్నట్లే నీకు మంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరుడిగా వస్తాడులే!

మీరందరూ నాకు పుట్టబోయే బాబునో, పాపనో చూడడానికి మా ఇంటికొస్తారని ఆశిస్తూ...

మీ

– అనూష

★★★

సునీత ఇంటి ముందు ఆటో ఆగింది. ఆమె అనూష ప్రాణస్నేహితురాలు. ఇద్దరి ఇళ్లు ఒకే వీధిలోనే. అనూష ఆటో దిగి కాలింగ్ బెల్ నొక్కింది. నిమిషం తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. అనూషను చూడగానే సునీత ఆశ్చర్యపోయింది.

''ఏమిటే... ఇంటికెళతానని చెప్పావు? అప్పుడే వచ్చేసావు?''

''లోపలికెళ్లి మాట్లాడుకుందామా?''

''ఐ యాం సారీ... రా లోపలకి. ఏమిటి? అప్పుడే తిరిగొచ్చేశావు?''

అనూష అక్కడ జరిగిందంతా పూస గుచ్చినట్లు చెప్పింది. సునీత అనూష చెప్పిం దంతా వింటూ కుంగిపోయింది. కాస్సేపటికి తేరుకొని 'నువ్వు సందీప్ కలిసి వుంటున్నట్లు ఎందుకు అబద్ధపు ఉత్తరం రాసిపెట్టొచ్చావు?' అని అడిగింది.

''నేను పారిపోయి వచ్చి అమ్మానాన్నలకు చాలా బాధ కలిగించాను. ఆ విషయమే ఎప్పుడూ ఒక ముల్లులా నా హృదయాన్ని గుచ్చుతూ వుంటుంది. ఇక మా వాళ్లను ఎప్పటికీ బాధపెట్టకూడదనిపించింది. ఎలాగూ వాళ్లకు భారం కాకుండా దూరమ వ్వాలని నిర్ణయించుకున్నాను. దూరమయ్యే దాన్ని వాళ్లను కాస్త సంతోషపెట్టి దూరమ వ్వాలనిపించింది.''

★

